



ఏమేం చేయాలో అన్నీ చేశాం. అటుపక్క (సీమాంధ్ర ప్రాంత నేతలు) అంతా ఒక్కటయ్యారు. ఇంత జరుగుతున్నా మీరు (కాంగ్రెస్) ఏమీ పట్టనట్టు ఉంటే మంచిది కాదు. తెలంగాణ కోసం అందరం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అనివార్యతలు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఒక్కటిగా కదలకపోతే తెలంగాణ భవిష్యత్ తరాలు క్షమించవు' అని తేల్చిచెప్పిన కేసీఆర్ అదే రోజు రాజకీయ జేఏసీని ఏర్పాటు చేద్దామని ప్రకటించారు. ఆ తెల్లారే డిసెంబర్ 24న హైదరాబాద్‌లోని కళింగ ఫంక్షన్ హాల్‌లో తొలి జాక్ సమావేశం నిర్వహించారు. ఉద్యమపార్టీగా, కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్షకు నాయకత్వం వహించిన పార్టీగా నాటి బీఆర్ఎస్ జాక్ కార్యాచరణకు పెద్దన్నపాత్ర పోషించింది. స్థానిక కాంగ్రెస్ పార్టీ మనస్ఫూర్తిగా కలిసిరాకపోయినా, జాక్‌లోనే ఉంటూ దాని విచ్ఛిన్నానికి టీడీపీ కుట్రలు పన్నినా (జాక్ కొద్దిరోజులకు టీడీపీని బహిష్కరించింది), బీఆర్ఎస్ పార్టీ సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీలతోపాటు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు, వైద్యులు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు సహా తెలంగాణ సబ్బండ సమాజాన్ని కలుపుకొని ఉద్యమాన్ని నడిపించింది. తెరవెనుక ఉంటూ అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తూ తెరముందు ఉమ్మడి కార్యాచరణ విజయవంతం చేస్తూ బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర సాధన 'లక్ష్య'కవచంగా నిలబడింది. జాక్‌లోని కొన్ని భాగస్వామ్య పక్షాలు అప్పుడప్పుడూ రాగద్వేషాలు సృష్టించాలని చూసినా.. ఉద్యమాన్ని హింసవైపు మరల్చే తాత్కాలిక ఆవేశ కార్యాచరణకు దిగుదామని చెప్పినా...1969 అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి ఉద్యమం పొరపాటున హింసవైపు మళ్లితే తెలంగాణ పదమే డిక్షనరీలో వెతుక్కోవాల్సిన దయనీయ దుస్థితి నెలకొనే ప్రమాదం ఉంటుందని కేసీఆర్ గ్రహించారు. దీంతో హింస దిశగా కార్యాచరణ లేకుండా గాంధేయ మార్గంలోని పోరాట పంథానే అనుసరించారు. తుదకు ఆ వ్యూహమే తెలంగాణను విజయతీరాలకు చేర్చింది.

## పడావుపడ్డ చెరువు పరవశం..



తెలంగాణ రాష్ట్ర బిల్లు పార్లమెంట్‌కు రావటానికి దాదాపు రెండేండ్ల ముందే ఢిల్లీలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, సాగునీటి రంగ నిపుణుడు ఆర్.విద్యాసాగర్‌రావుతో కేసీఆర్ జరిపిన మేథోమథనంలో పుట్టిన పథకమే.. మిషన్ కాకతీయ. శతాబ్దాలుగా తెలంగాణ పల్లెల ఆర్థిక, ప్రజాస్వామిక ప్రగతికి చెరువు ఆదరువుగా ఉన్నది. అటువంటి చెరువులను ఉమ్మడి పాలకులు ధ్వంసం చేశారు. 'గంగాళంలా ఉన్న చెరువులు తాంబాలంలా అయ్యాయి. నిర్లక్ష్యం, వివక్షకు ఇంతకన్నా పెద్ద ఉదహరణ ఏం కావాలి?' అని ఉద్యమ సమయంలో కేసీఆర్ ఊరూరా నిప్పులు చెరిగారు. ఈ నేపథ్యంలో వందల ఏండ్లపాటు తెలంగాణను సస్యశ్యామలం చేసి, కొన్ని దశాబ్దాలుగా పూడుకుపోయిన దాదాపు 46 వేల చెరువులను పునరుద్ధరించటమే లక్ష్యంగా మిషన్ కాకతీయ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించింది. 2015 మార్చి 12న కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లోని పాత చెరువులో పూడిక తీసి కేసీఆర్ ఈ విశిష్ట పథకానికి నాంది పలికారు.







